మేయర్ అపర్ణకు మద్దతుగా ఆత్మీయ సమావేశం

మార్వాడీ సంఘంతో మేయర్ అభ్యర్థి అపర్ణ భేటీ

సమస్యల పరిష్కారానికి అండగా ఉంటా

నగరాభివృద్ధిలో వ్యాపార రంగానిదే కీలక పాత్ర..

వివరాలు 2లో..

గుంటూరు నగర అభివృద్ధిలో వ్యాపార, వాణిజ్య రంగాల పాత్ర కీలకమని మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ అన్నారు. మార్వాడీ సంఘం ప్రతినిధులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నగర ప్రగతి, వ్యాపారుల సమస్యల పరిష్కారం, ఉపాధి అవకాశాల కల్పనపై మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.

మన రాజధాని
రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
సోమవారం 26 అక్టోబర్ 2026 పేజీలు : 4

ప్రజాసేవలో

వివరాలు 2లో..

రాజకీయ ప్రస్థానంలోరెండు దశాబ్దాల ముద్ర

టిడిపికి అంకితమైన వెంకటస్వామి కుటుంబం

భర్త బాటలో జడ్పీటీసీ బరిలో నక్కల లక్ష్మి

వెంకటస్వామి ఫ్యామిలీ

"రాజకీయాల్లో పదవులు తాత్కాలికం.. ప్రజల్లో సంపాదించుకున్న విశ్వాసమే శాశ్వతం. కర్లపాలెం మండలంలో నక్కల వెంకటస్వామి రాజకీయ ప్రస్థానం ఈ కోణంలో ప్రాధాన్యం సంతరించుకుంది. దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీకి అండగా నిలుస్తూ, ప్రజా సమస్యలపై స్పందిస్తూ, కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ సాగిన ఆయన ప్రయాణం ఇప్పుడు సతీమణి నక్కల లక్ష్మి జడ్పీటీసీ అభ్యర్థిత్వంతో మరోసారి చర్చనీయాంశంగా మారింది."

బాపట్ల రక్షణ ప్రతినిధి(జగదీశ్)

రాముడి భూములు హాంఫట్

చావల్లమూడిలో 18.60 ఎకరాలపై వివాదం

ధర్మకర్తల కుటుంబంపై నాగభైరవ సంచలన ఆరోపణలు

ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోని దేవదాయ అధికారులు!

చావల్లమూడి శ్రీ సీతారామేశ్వరస్వామి ఆలయానికి చెందినవిగా పేర్కొంటున్న 18 ఎకరాల 60 సెంట్ల భూముల వ్యవహారం దేవదాయ శాఖలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. కోట్ల విలువైన భూములను ప్రైవేటు వ్యక్తులకు విక్రయిం చారని, రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించి రిజిస్ట్రేషన్లు జరిపించారని భక్తుడు నాగభైరవ వేణుగోపాల్ ఆరోపిస్తున్నారు. కీలక ఆధారాలతో అసిస్టెంట్ కమిషనర్ మాధవి, ఈవో తన్నీరు నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేసినా విచారణలో కదలిక లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలేవీ? ధర్మకర్త లుగా కొనసాగుతున్న కుటుంబం పాత్రపై విచారణ ఏదీ? గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టిచెరు కూరు మండలం చావల్లమూడిలో వెలుగుచూసిన ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, రికార్డులు పరిశీలించి వాస్తవాలను నిగ్గుతేల్చాలి.

ఎడిటర్ నరేంద్ర

వివరాలు 2లో..

పల్నాడు లో చక్రం తిప్పేదెవరు?

వివరాలు 2లో..

రేపే కూటమిలో జడ్పీ ల ప్రకటన

జడ్పీపీఠంపై నలుగురు గురి... పెద్దల వ్యూహంపై ఉత్కంఠ

ఏకగ్రీవంగా గెలిచిన ఇద్దరిలో ఒకరికే అవకాశం? పోటీలో ఉన్న మరో ఇద్దరి ఆశలూ బలంగానే!

ఎంపీ కృష్ణదేవరాయ మౌనం వెనుక వ్యూహం ఏంటి..!

పల్నాడు రాజకీయాల్లో ఇప్పుడు అసలైన చదరంగం మొదలైంది! జడ్పీ పీఠం ఒక్కటే.. ఆశావహులు నలుగురు.. తెరవెనుక వ్యూహాలు ఎన్నో! ఎమ్మెల్యేల రాజకీయ లెక్కలు, ఆశావహుల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు, ఎంపీ మౌనం.. వెరసి జడ్పీ చైర్‌పర్సన్ ఎంపిక జిల్లా టీడీపీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఏకగ్రీవంగా గెలిచిన ఇద్దరిలో ఒకరికి పట్టం కడతారా? లేక ఎన్నికల బరిలో ఉన్న మరో ఇద్దరిలో ఒకరికి అనూహ్య అవకాశం కల్పిస్తారా? సీనియర్ నేతల అభిప్రాయాలకు ప్రాధాన్యమిస్తారా.. అధిష్ఠానం తనదైన వ్యూహంతో నిర్ణయం తీసుకుంటుందా? ఎవరికి వారు తమదే పైచేయి అన్న ధీమాతో సాగుతున్న వేళ.. పల్నాడు జడ్పీ పీఠంపై పార్టీ పెద్దల మనసులో ఎవరున్నారు? ఇప్పుడు ఇదే జిల్లా రాజకీయాల్లో మిలియన్ డాలర్ల ప్రశ్న!

శిలార్ పల్నాడు, రక్షణ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:

చిన్నారుల మృతితో బ్రాహ్మణ కోడూరులో ఉద్రిక్తత

సవతి తల్లిపై విషం ఇచ్చిందన్న ఆరోపణలు..

పోలీసు జీపు ధ్వంసం

3లో

పొన్నూరు రూరల్ మండలం బ్రాహ్మణ కోడూరులో ఇద్దరు చిన్నారుల మృతితో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సవతి తల్లి విషం ఇచ్చిందన్న ఆరోపణలతో గ్రామస్థులు ఆందోళనకు దిగారు. మృతదేహాల వద్ద ధర్నా నిర్వహించి, బాధ్యులను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసు జీపు ధ్వంసమైంది.

పొన్నూరు రక్షణ క్రైమ్ స్పెషల్

బాపట్ల తీరానికి ఆర్నబ్ ముప్పు!

28న తీరం దాటే అవకాశం.. అప్రమత్తమైన యంత్రాంగం

125 కి.మీ. వేగంతో గాలులు వీచే ప్రమాదం

అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష..

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ఆదేశాలు

3లో

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా బలపడే సూచనలతో బాపట్ల--విశాఖపట్నం తీరంపై ముప్పు పొంచి ఉంది. భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో నిజాంపట్నం సహా తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదు. వాతావరణ శాఖ, జిల్లా అధికారుల హెచ్చరికలను పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

బాపట్ల, రక్షణ న్యూస్:

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/25/2026 10:33 PM Page 2

రాముడి భూములు హాంఫట్

మొదటి పేజీ తరువాయి

ఎడిటర్ నరేంద్ర...

దాతలు దేవుడికి ఇచ్చిన భూములనే అమ్మేసుకున్నారన్న ఆరోపణలు ఇప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో కలకలం రేపుతున్నాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టిచెరుకూరు మండలం చావళ్లమూడి గ్రామంలోని శ్రీ సీతారామేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన 18 ఎకరాల 60 సెంట్ల భూముల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఆలయ కళ్యాణ ధర్మకర్తలుగా కొనసాగుతున్న ఓ కుటుంబం దేవదాయ శాఖకు సంబంధించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి కోట్ల రూపాయలు కూడబెట్టుకుందని నాగభైరవ వేణుగోపాల్ ఆరోపిస్తున్నారు. భూములను విక్రయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు ఇప్పటికీ కళ్యాణ ధర్మకర్తలుగా కొనసాగుతుండటంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దేవుడి ఆస్తుల పరిరక్షణ బాధ్యత వహించాల్సిన దేవదాయ శాఖ అధికారులు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు.దాతలు ఆలయ అభివృద్ధి, దేవుడి సేవల కోసం సమర్పించిన భూములను దేవాలయ అవసరాలకు వినియోగించకుండా ప్రైవేటు వ్యక్తులకు ఎలా విక్రయిస్తారని నాగభైరవ నిలదీస్తున్నారు. ధర్మకర్తలుగా చెప్పుకుంటున్న కుటుంబం రెవెన్యూ శాఖలోని అధికారులతో కుమ్మక్కై ఆర్‌ఎస్‌ఆర్ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకుని, రిజిస్ట్రేషన్ల జరిపి భూములను విక్రయించినట్లు ఆయన ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ రికార్డులు ఎలా మారాయి? రిజిస్ట్రేషన్లు ఏ ప్రాతిపదికన జరిగాయి? దేవదాయ శాఖ అనుమతులు తీసుకున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ భూముల వ్యవహారానికి సంబంధించి నాగభైరవ వేణుగోపాల్ పలు కీలక పత్రాలు, ఆధారాలను సేకరించి దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మాధవి, ఆలయ ఈవో తన్నీరు నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పూర్వీకుల ఆస్తులకు సంబంధించిన పత్రాలను సైతం అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ అధికారులు ఫిర్యాదును తీవ్రంగా పరిగణించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువైన దేవాలయ భూములపై ఫిర్యాదు అందినా విచారణ చేపట్టకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. దేవుడి ఆస్తులను కాపాడాల్సిన అధికారులే మౌనంగా ఉంటే ఆలయ భూములకు రక్షణ ఎవరు కల్పిస్తారని నిలదీశారు.స్థానిక అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో నాగభైరవ దేవదాయ శాఖ కమిషనర్‌ను కలిశారు. దసరా ఉత్సవాల అనంతరం ఈ వ్యవహారంపై విచారణ జరిపిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అయితే కమిషనర్‌ను కలిసిన విషయం అసిస్టెంట్ కమిషనర్ మాధవికి తెలిసిన తర్వాత, ఇకపై తన వద్దకు రావద్దని, ఏదైనా ఉంటే కమిషనర్‌నే కలవాలని చెప్పినట్లు నాగభైరవ ఆరోపిస్తున్నారు. ఫిర్యాదుదారుడికి న్యాయం చేయాల్సిన అధికారులు ఇలా వ్యవహరించడం ఏమిటని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాల్సి ఉంది.ధర్మకర్తల మండలిలోని సభ్యుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూముల విక్రయాలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న కుటుంబ సభ్యులు ఇప్పటికీ ధర్మకర్తలుగా ఎలా కొనసాగుతున్నారో ఉన్నతాధికారులు తేల్చాలని నాగభైరవ కోరుతున్నారు. గతంలో ఇదే గ్రామంలో చెరువు పరిసరాల్లోని సుమారు 200 కొబ్బరి చెట్లను మట్టి తవ్వకాల కోసం నరికివేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయని పేర్కొంటున్నారు. ఆ వ్యవహారంపైనా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.దేవదాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి 18.60 ఎకరాల భూములకు సంబంధించిన దానపత్రాలు, ఆర్‌ఎస్‌ఆర్ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు పరిశీలించాలని బాధితుడు కోరుతున్నారు. భూముల విక్రయాల్లో అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి రక్షణ దినపత్రిక సేకరించిన పత్రాలు, ఆధారాలపై పరిశీలన కొనసాగిస్తూ వరుస కథనాలు ప్రచురించనుంది. దేవుడి ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించినవారు ఎవరైనా బాధ్యత వహించాల్సిందేనని భక్తులు కోరుతున్నారు.

ప్రజాసేవలో వెంకటస్వామి ఫ్యామిలీ

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ ప్రతినిధి(జగదీశ్)

రాజకీయాల్లో వ్యక్తిగత ఎదుగుదల కంటే ప్రజలతో అనుబంధానికి ప్రాధాన్యమిచ్చే నాయకత్వమే కాలపరీక్షకు నిలుస్తుంది. కర్లపాలెం మండల రాజకీయాల్లో నక్కల వెంకటస్వామి ప్రస్థానం ఈ అంశాన్ని గుర్తుచేస్తోంది. నర్రావారిపాలెం గ్రామానికి చెందిన ఆయన సుమారు రెండు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయి వరకు వివిధ బాధ్యతలు నిర్వహించారు. పార్టీకి రాజకీయంగా అనుకూల పరిస్థితులు ఉన్నా, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా తనవంతు బాధ్యతను నిర్వర్తిస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉండటం ఆయన రాజకీయ ప్రయాణంలో ప్రత్యేకతగా నిలిచింది.ప్రజాసేవకు కులమతాలకు అతీతంగా స్పందించడం, సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం వంటి అంశాలు ఒక నాయకుడి ప్రజాదరణను ప్రభావితం చేస్తాయి. స్థానికంగా ప్రజా సమస్యలపై స్పందిస్తూ, అవసరమైన సందర్భాల్లో బాధితులకు భరోసా కల్పించే నాయకుడిగా వెంకటస్వామి గుర్తింపు పొందారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. సమస్య ఏదైనా తన దృష్టికి వచ్చినప్పుడు సంబంధిత వ్యక్తులతో మాట్లాడి పరిష్కార మార్గాలను అన్వేషించడం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా తన ముద్రను నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారు.

పదవులకంటే ప్రజలతో అనుబంధమే ప్రధానం

నక్కల వెంకటస్వామి రాజకీయ ప్రస్థానంలో వివిధ పదవులు భాగమైనప్పటికీ, పార్టీ సంస్థాగత నిర్మాణంలో ఆయన నిర్వహించిన బాధ్యతలు ప్రత్యేకంగా ప్రస్తావించదగినవి. 2001 నుంచి 2006 వరకు నర్రావారిపాలెం సర్పంచ్‌గా పనిచేసిన ఆయన, 2014 నుంచి 2020 వరకు కర్లపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2016 నుంచి 2018 వరకు బాపట్ల నియోజకవర్గ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా, 2021 నుంచి 2024 వరకు బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 2022 నుంచి బాపట్ల నియోజకవర్గ క్లస్టర్--7 ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.ఈ పదవులు ఆయనకు పార్టీ వ్యవహారాలపై అనుభవాన్ని అందించడంతో పాటు, స్థానిక రాజకీయ సమీకరణాలు, కార్యకర్తలతో సమన్వయం, ప్రజా సమస్యలపై అవగాహన పెంపొందించు చుకునే అవకాశం కల్పించాయి. రాజకీయాల్లో నిలదొక్కుకోవడానికి పదవులతో పాటు నిరంతర ప్రజాసంబంధాలు అవసరం. ఆ దిశగా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ కర్లపాలెం మండలంలో ప్రత్యేక గుర్తింపు పొందేందుకు వెంకటస్వామి కృషి చేశారు.

రాజకీయ వారసత్వం కాదు.. ప్రజాసేవకు మరో అడుగు

వెంకటస్వామి సతీమణి నక్కల లక్ష్మి కూడా గతంలో ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం కలిగి ఉన్నారు. 2006 నుంచి 2012 వరకు నర్రావారిపాలెం గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడంతో ఆమె రాజకీయ ప్రస్థానంపై ఆసక్తి నెలకొంది.గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవాన్ని మండల స్థాయికి విస్తరింపజేసే లక్ష్యంతో ఆమె ఎన్నికల బరిలోకి దిగారు. భర్తకు ఉన్న రాజకీయ అనుభవం, పార్టీ శ్రేణులతో పరిచయాలు, తనకున్న గత పాలనా అనుభవం ఆమె అభ్యర్థిత్వానికి నేపథ్యంగా నిలుస్తున్నాయి. అయితే ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని పొందడం, స్థానిక అవసరాలను అర్థం చేసుకోవడం, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణను ముందుకు తీసుకెళ్లడం అభ్యర్థిగా ఆమె ముందున్న ప్రధాన బాధ్యతలు.

కర్లపాలెం రాజకీయాల్లో వెంకటస్వామి ప్రత్యేక ముద్ర

ఒక పార్టీని గ్రామస్థాయి నుంచి మండల స్థాయిలో బలోపేతం చేయడంలో నాయకులు, కార్యకర్తల పాత్ర కీలకం. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం, శ్రేణులను సమన్వయం చేయడం, ప్రజలతో సంబంధాలను కొనసాగించడం వంటి అంశాలు రాజకీయ నాయకత్వానికి పునాదులుగా నిలుస్తాయి. ఈ నేపథ్యంలో వెంకటస్వామి సుదీర్ఘ రాజకీయ అనుభవం, లక్ష్మి గత ప్రజాప్రతినిధి హోదాలో పొందిన అనుభవం ప్రస్తుత ఎన్నికల సందర్భంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.రాజకీయాల్లో నీతి, నిజాయితీ, నిబద్ధతలకు ప్రజల మద్దతు తోడైతేనే ఆ గుర్తింపు చిరస్థాయిగా నిలుస్తుంది. నక్కల కుటుంబం తమ ప్రజా సంబంధాలను, రాజకీయ అనుభవాన్ని రాబోయే రోజుల్లో ఏ విధంగా ప్రజాసేవకు ఉపయోగించుకుంటుందన్నది కీలకం. కర్లపాలెం మండలంలో నక్కల వెంకటస్వామి సంపాదించుకున్న రాజకీయ గుర్తింపు నేపథ్యంలో, జడ్పీటీసీ అభ్యర్థిగా నక్కల లక్ష్మి సాగించనున్న ప్రస్థానం ఇప్పుడు స్థానిక రాజకీయాల్లో ఆసక్తికర అంశంగా మారింది.

పల్నాడు లో చక్రం తిప్పేదెవరు?

శిలార్ పల్నాడు, రక్షణ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:

పల్నాడు జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు జడ్పీ చైర్‌పర్సన్ పీఠం హాట్‌టాపిక్‌గా మారింది. జిల్లాలోని కీలక నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేల రాజకీయ వ్యూహాలు, స్థానికంగా నేతల బలాబలాలు, పార్టీ అధిష్ఠానం తీసుకోబోయే నిర్ణయం.. ఇలా అనేక అంశాలు జడ్పీ పీఠం చుట్టూ ఆసక్తిని పెంచుతున్నాయి. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వంటి కీలక నేతలున్న జిల్లాలో జడ్పీ చైర్‌పర్సన్ ఎంపిక రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వ్యవహరిస్తున్న మౌనం కూడా చర్చనీయాంశంగా మారింది.

నలుగురి పేర్లు.. ఒక్కరికే పీఠం

పల్నాడు జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న వారిలో కారంపూడి జడ్పీటీసీగా ఏకగ్రీవమైన డాక్టర్ కొండపల్లి శివకుమారి, పెదకూరపాడు జడ్పీటీసీ నల్లపాటి కీర్తన పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు నకరికల్లు నుంచి పోటీ చేస్తున్న డాక్టర్ నాగోతు (నలబోతు) వెంకట సత్య సరోజ, పిడుగురాళ్ల జడ్పీటీసీ అభ్యర్థి డాక్టర్ ఉన్నం దీపిక కూడా రేసులో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. నలుగురూ ఉన్నత విద్యావంతులు కావడం, ప్రత్యక్ష రాజకీయాల్లో కొత్తగా అడుగుపెట్టడం ఈ పోటీకి ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఏకగ్రీవంగా ఎన్నికైన ఇద్దరిలో ఒకరికి చైర్‌పర్సన్ పదవి దక్కే అవకాశముందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఎన్నికల బరిలో ఉన్న మరో ఇద్దరి అనుచరులు మాత్రం తమ నేతలకూ అవకాశాలు ఉన్నాయని ధీమా వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దీంతో పోటీ కేవలం ఆశా వహుల మధ్యే కాకుండా వారి వెనుక ఉన్న స్థానిక రాజకీయ సమీకరణాల మధ్య కూడా ఆసక్తికరంగా మారింది.

యరపతినేని వ్యూహం.. ఇతర నేతల లెక్కలేమిటి?

పల్నాడు రాజకీయాల్లో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చాలాకాలంగా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో జడ్పీ చైర్‌పర్సన్ ఎంపికలో ఆయన అభిప్రాయం ఏ మేరకు ప్రభావం చూపుతుందన్న చర్చ సాగుతోంది. మరోవైపు మాచర్ల, వినుకొండ, నరసరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాల నాయకుల అభిప్రాయాలు కూడా ప్రాధాన్యం సంతరించుకోవచ్చని భావిస్తున్నారు. అయితే ఏ ఎమ్మెల్యే ఏ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నారనే విషయం ఇంకా ఒక్క సమాచారం చాలా గోప్యంగా ఉంది . ఎవరికి వారు తమ రాజకీయ లెక్కలతో ముందుకెళ్తున్నారనే వాదనలు వినిపిస్తున్నా, నేపథ్యంలో రాజకీయాలు ప్రాధాన్యత సంతరించుకుంది

ఎంపీ మౌనం.. అధిష్ఠానం నిర్ణయమే కీలకం

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ అంశంపై బహిరంగంగా స్పందించకపోవడం ఆసక్తిని పెంచుతోంది. జిల్లా నాయకుల అభిప్రాయాలు, సామాజిక సమీకరణాలు, పార్టీకి విధేయత, స్థానికంగా అభ్యర్థుల బలం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే తుది నిర్ణయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

చక్రం తిప్పేదెవరు?...పల్నాడు జడ్పీ పీఠం కోసం నలుగురు మహిళా నేతలు ఆశలు పెట్టుకోవడంతో పార్టీ అంతర్గత రాజకీయాలు ఆసక్తికర మలుపు తీసుకున్నాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన ఇద్దరిలో ఒకరికి ప్రాధాన్యం దక్కుతుందా? లేక ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో ఒకరికి అవకాశం కల్పిస్తారా? జిల్లా ఎమ్మెల్యేల అభిప్రాయాలకు పెద్దపీట వేస్తారా? రాష్ట్ర అధిష్ఠానం తనదైన నిర్ణయం తీసుకుంటుందా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఎవరికి వారు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారనే చర్చ ఉన్నప్పటికీ, చివరకు పార్టీ అధిష్ఠానం నిర్ణయమే కీలకం కానుంది. దీంతో పల్నాడు జడ్పీ పీఠం చుట్టూ ఉత్కంఠ కొనసాగుతోంది.

మేయర్ అపర్ణకు మద్దతుగా ఆత్మీయ సమావేశం

మొదటి పేజీ తరువాయి

గుంటూరు రక్షణ న్యూస్

నగరంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్వాడీ సంఘం ప్రతినిధులతో మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య రంగాలతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ మార్వాడీ సమాజం ముందుంటుందని పేర్కొన్నారు. వ్యాపారుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. తాను స్థానిక కుటుంబంలో ఆడబిడ్డనని పేర్కొంటూ, రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.పెమ్మసాని మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఉన్నప్పుడే ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. మార్వాడీ, జైన్ సమాజాలు సంప్రదాయాలు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు ప్రాధాన్యమిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందని తెలిపారు.ఈ సమావేశంలో జైన్ మార్వాడీ సమాజ అధ్యక్షుడు జుగ్రాజ్ భండారి, అమృత్‌లాల్, మహావీర్‌చంద్, కిశోరీలాల్, గౌతమ్‌చంద్, మహావీర్ లూనియా, మోహన్‌లాల్, అశోక్, సురేష్‌కుమార్, కాంతిలాల్ సలేచా, ఫేవర్‌చంద్, వినోద్ బాగ్రేచా, రాజు బఫ్నా, రాజు భండారి, లలిత్ భండారి, రమేష్ పోర్వాల్, రమేష్‌కుమార్ తొప్పివాల్, జగదీష్, జుగ్రాజ్ పురోహిత్ తదితరులు పాల్గొన్నారు.మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్రనాని, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు తిరుపతిరావు, టీడీపీ నాయకుడు ఉగ్గిరాల సీతారామయ్య, మాజీ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ (బాబు) హాజరయ్యారు.

చిన్నారుల మృతితో బ్రాహ్మణ కోడూరులో ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి

పొన్నూరు రక్షణ క్రైమ్ స్పెషల్

పొన్నూరు రూరల్ మండలం బ్రాహ్మణ కోడూరు గ్రామంలో ఇద్దరు చిన్నారుల మృతితో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చిన్నారులకు సవతి తల్లి విషం ఇచ్చిందని ఆరోపిస్తూ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. మృతదేహాల వద్ద ధర్నా నిర్వహించి, ఘటనకు బాధ్యులుగా భావిస్తున్న వారిని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో చిన్నారుల తండ్రి, సవతి తల్లిపై గ్రామస్థులు దాడికి దిగినట్లు సమాచారం. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో పొన్నూరు రూరల్ పోలీసుల జీపు ధ్వంసమైంది.ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకు న్నాయి. చిన్నారుల మరణానికి గల కారణాలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. చేబ్రోలు, పొన్నూరు రూరల్ ఎస్ఐలు గ్రామస్థులతో చర్చలు జరుపుతూ ఆందోళనను విరమి ంపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడుతున్నారు.చిన్నారులకు విషం ఇచ్చారన్న ఆరోపణలు ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. మృతికి గల అసలు కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

టీడీపీ శ్రేణులు ఎన్నికల సమరానికి సిద్ధం కావాలి

ప్రచార రథానికి పూజలు.. ఎన్నికల ప్రచారానికి నరేంద్ర వర్మ శ్రీకారం

బాపట్ల రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తన ప్రచార రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి టీడీపీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. గత రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరిస్తూ, పార్టీ ప్రచారాన్ని మరింత వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల్లో కూటమి విజయదుందుభి మోగించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమన్వయంతో, సమష్టిగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగిస్తూ టీడీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ప్రచార రథానికి పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన అనంతరం పార్టీ శ్రేణులు ఎన్నికల కార్యాచరణపై దృష్టి సారించాయి.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

డీఎస్పీ చంద్రమౌళి

బాపట్ల రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, విద్వేషపూరిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల డీఎస్పీ సీహెచ్ చంద్రమౌళి హెచ్చరి ంచారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కులమతాల మధ్య చిచ్చుపెట్టే పోస్టులు, తప్పుడు వార్తలు, నిరాధార ఆరోపణలను సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని స్పష్టం చేశారు. సమాచారాన్ని నిజానిజాలు తెలుసుకోకుండా ఇతరులకు షేర్ చేయడం వల్ల అనవసర ఉద్రిక్తతలు ఏర్పడే అవకాశం ఉందన్నారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుంటూ ప్రశాంతమైన ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ చంద్రమౌళి పిలుపునిచ్చారు.

బాపట్ల తీరానికి ఆర్నబ్ ముప్పు!

మొదటి పేజీ తరువాయి

బాపట్ల, రక్షణ న్యూస్:

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతుండటంతో బాపట్ల జిల్లాపై ముప్పు పొంచి ఉంది. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం అక్టోబరు 28 ఉదయం బాపట్ల--విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 115--125 కిలోమీటర్ల వేగంతో గాలులు, అప్పుడప్పుడు 140 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచవచ్చని హెచ్చరించింది. ఈ ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. నిజాంపట్నం, రేపల్లె, బాపట్ల, చీరాల తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

వాయుగుండం.. తుపానుగా బలపడే అవకాశం

తూర్పు మధ్య, దానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం క్రమంగా బలపడుతోంది. అక్టోబరు 25న ఐఎండీ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం ఇది 26వ తేదీ ఉదయానికి తుపానుగా, 27న తీవ్ర తుపానుగా మారి, 28వ తేదీ ఉదయానికి మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. అనంతరం బాపట్ల--విశాఖపట్నం మధ్య తీరం దాటవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే తుపాను కదలిక, తీవ్రతను బట్టి తీరం దాటే ప్రాంతం, సమయం మారే అవకాశం ఉన్నందున తాజా వాతావరణ హెచ్చరికలను ప్రజలు గమనించి అప్రమత్తంగా ఉండాలి అని సూచిస్తున్నారు

సీఎం సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు

తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తీర ప్రాంతాల్లో ప్రజలకు ముందస్తు హెచ్చరికలు అందించాలని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి రప్పించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల్లో కంట్రోల్ రూములు, అత్యవసర సహాయ వ్యవస్థలు అందుబాటులో ఉంచి, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు.

తీర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ఐఎండీ హెచ్చరికల ప్రకారం అక్టోబరు 27, 28 తేదీల్లో తీర ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 29న కూడా భారీ వర్షాలు, ఉరుములు, బలమైన గాలుల ప్రభావం ఉండవచ్చని అంచనా. నిజాంపట్నం పోర్టులో దూర హెచ్చరిక సంకేతం నంబరు--1 ఎగురవేసినట్లు వాతావరణ శాఖ తీర బులెటిన్ పేర్కొంది. సముద్రం అలజడిగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లకూడదు. తీర ప్రాంతాల్లోని ప్రజలు సముద్రానికి దూరంగా ఉండాలి. బలమైన గాలులకు హోర్డింగులు, చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలే ప్రమాదం ఉన్నందున వాటి సమీపంలో ఉండకూడదు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తీర ప్రాంత ప్రజలు తాగునీరు, పొడి ఆహారం, మందులు, టార్చ్‌లైట్లు, మొబైల్ ఛార్జింగ్ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలి. లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారు అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి. రైతులు పంటలు, ధాన్యం, వ్యవసాయ పరికరాలను సాధ్యమైనంతవరకు భద్రపరచుకోవాలి. విద్యుత్ తీగలు తెగిపడితే వాటిని తాకకూడదు. వదంతులను నమ్మకుండా ఐఎండీ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను పాటించాలి. తుపాను తీరం దాటే సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేందుకు కీలకం.

గడువులోగా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలి

కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు రక్షణ న్యూస్

గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా నవంబర్ 1న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి ఓటరు స్లిప్పుల పంపిణీని నిర్ణీత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఆదివారం నగరంలోని వార్డుల్లో బీఎల్‌ఓలు ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టారు.నగరంలోని 596 పోలింగ్ కేంద్రాల పరిధిలో స్లిప్పుల పంపిణీ కోసం 596 మంది సిబ్బందిని నియమించినట్లు కమిషనర్ తెలిపారు. ప్రతి ఓటరుకు స్లిప్పు అందేలా సిబ్బంది

బాధ్యతాయుతంగా పనిచేయాలని, పంపిణీ ప్రక్రియను ప్రత్యేక అధికారులు, బీఎల్‌ఓ సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఓటరు స్లిప్పు అందించిన అనంతరం రశీదుపై కుటుంబంలోని ఒకరి సంతకం లేదా వేలిముద్ర తీసుకోవాలని స్పష్టం చేశారు. మరణించినవారు, నివాసం మారినవారు, అందుబాటులో లేనివారి వివరాలను నమోదు చేసి, సంబంధిత జాబితాను రిటర్నింగ్ అధికారికి సమ ర్పించాలని ఆదేశించారు.ఓటర్లు తమ వార్డు, పోలింగ్ కేంద్రం, ఓటరు జాబితా వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ https://sec-ems.ap.gov.in ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఎన్నికల వేళ అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదు

రౌడీషీటర్లకు సీఐ భాస్కర్ హెచ్చరిక

గుంటూరు రక్షణ న్యూస్

ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అల్లర్లు సృష్టి ంచేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకు ంటామని నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ భాస్కర్ హెచ్చరించారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆదివారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు.ఎన్నికల సమయంలో ఏ రాజకీయ పార్టీకి మద్దతుగా వ్యవహరిస్తూ రౌడీయిజానికి పాల్పడరాదని, ఇతరులను రెచ్చగొట్టడం, గొడవలు సృష్టించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే విధంగా వ్యవహరించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ భాస్కర్ కోరారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా ఉంటారని తెలిపారు.

ఈవీఎం గోడౌన్ భద్రతపై కలెక్టర్ తనిఖీ

సీసీ కెమెరాలు, సీల్స్, రికార్డుల పరిశీలన

గుంటూరు రక్షణ న్యూస్

గుంటూరు జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ శనివారం తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రతకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఈవీఎంలను భద్రపరిచిన గదుల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, గోడౌన్ తాళాలు, సీల్స్‌ను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. గోడౌన్ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. గోడౌన్‌కు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్‌ఎస్‌కే ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా విపత్తులు, అగ్నిమాపక శాఖ అధికారి ఎం. శ్రీనివాసరెడ్డి, సహాయ జిల్లా విపత్తులు, అగ్నిమాపక శాఖ అధికారి కె. కృష్ణారెడ్డి, రహదారులు భవనాల శాఖ డీఈ హజరతయ్య, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మల్లేశ్వరి, తహసీల్దార్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వాన్ని అధిగమించి ఆదర్శ ఉపాధ్యాయుడిగా నల్లపు రామకృష్ణారెడ్డి

గుంటూరు, రక్షణ న్యూస్:

బాల్యంలోనే చూపు కోల్పోయినా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా, జీవితంలో ఎదురైన అవమానాలు, అడ్డంకులను అధిగమించి 37 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా సేవలందించిన నల్లపు రామకృష్ణారెడ్డి ఆదర్శప్రాయుడని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కొనియాడారు. వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, వారి భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలిచిన ఆయన సేవలు ప్రశంసనీయమన్నారు. ఆదివారం గుంటూరులోని యుటిఎఫ్ హాలులో నిర్వహించిన నల్లపు రామకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కన్నా విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కన్నా మాస్టారు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ, నల్లపు రామకృష్ణారెడ్డి చూపు లేకపోయినా విద్యార్థులకు జీవితంలో ముందుకు సాగేందుకు దారి చూపించారని పేర్కొన్నారు. క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతకు ఆయన నిలువెత్తు నిదర్శనమన్నారు. బాహ్య ప్రపంచాన్ని కళ్లతో చూడలేకపోయినా, అంతరంగంలోని జ్ఞాన నేత్రాలతో విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారికి

తగిన మార్గనిర్దేశం చేశారని ప్రశంసించారు. తాను పనిచేసిన పాఠశాలను సమర్థంగా నిర్వహిస్తూ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా తన అనుభవాన్ని సమాజ సేవకు వినియోగించి అంధులు, అనాథలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రముఖ విద్యావేత్త, కన్నా విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కన్నా మాస్టారు మాట్లాడుతూ, అంధులకు జ్ఞానజ్యోతిని ప్రసాదించిన లూయిస్ బ్రెయిలీ విగ్రహాన్ని విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో ప్రతిష్ఠించినట్లు తెలిపారు. నల్లపు రామకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా వెల్లాల చెరువు పాఠశాలలో చదువుకున్న 17 బ్యాచ్‌ల విద్యార్థులు పాల్గొని ఆయనను సత్కరించడం అపూర్వమన్నారు. అంధత్వాన్ని అధిగమించి బీఏ, బీఈడీ, ఎంఏ హిస్టరీ, ఎంఏ తెలుగు వంటి విద్యార్హతలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. శ్రీ షిరిడీ సాయి దీన జనసేవా సమితి అధ్యక్షుడు ఆనంగి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, దివంగత పబ్బరాజు వెంకటేశ్వరరావు గుంటూరు నగరంలో వేలాది మంది అంధులకు విద్య అందించారని, వారిలో సుమారు 250 మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని గుర్తుచేశారు. సన్మాన గ్రహీత నల్లపు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, అంధుడైన తనను ప్రోత్సహించి అభివృద్ధి పథంలో నడిపించిన భార్య కుమారి, తల్లిదండ్రులు, స్నేహితులు, సహ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వి. రమణప్ప, మండల విద్యాధికారి కొల్లి విజయ్ భాస్కర్, జాతీయ అంధుల సమాఖ్య నేతలు పి.వి. నారాయణరెడ్డి, ఎస్. నాగార్జున, ఎం. రామసుబ్బయ్య, కె. నాగేంద్ర, మస్తాన్ వలి, బ్యాంకు అధికారి టి. కోటిరెడ్డి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అతిథులు నల్లపు రామకృష్ణారెడ్డి, ఆయన ధర్మపత్ని కుమారిని గజమాలతో, శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి

సత్తెనపల్లి, రక్షణ న్యూస్:

వ్యాపార రంగంలోనే కాకుండా సమాజ సేవ, దానధర్మాల్లోనూ ఆర్యవైశ్యులు ముందుంటారని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని గోశాల కల్యాణ మండపంలో నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సత్తెనపల్లి అభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర ఎంతో కీలకమని, పట్టణ ఆర్థిక, సామాజిక ప్రగతిలో వారి సేవలను విస్మరించలేమని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు వ్యాపార కార్యకలాపాలతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ సమాజ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నారని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సమాజంలో వివిధ వర్గాల మధ్య సత్సంబంధాలు, పరస్పర సహకారం పెంపొందించడంలో ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని, వ్యాపార వర్గాలు కూడా స్థానిక అవసరాల పరిష్కారంలో చొరవ చూపాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతు తెలిపి, వారిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆర్యవైశ్య బంధువులను కోరారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రజలతో కలిసి పనిచేయడం ద్వారా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. సత్తెనపల్లి పట్టణంలో మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజలకు అవసరమైన సేవల విస్తరణ, వ్యాపార కార్యకలాపాలకు అనుకూల వాతావరణం కల్పించడం వంటి అంశాల్లో సమష్టి కృషి అవసరమని ఈ సందర్భంగా చర్చించారు. ప్రజాప్రతినిధులు, వ్యాపార వర్గాలు, సామాజిక సంస్థలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తే స్థానిక అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘ పెద్దలు, వ్యాపార ప్రముఖులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన ఈ ఆత్మీయ సమ్మేళనం ద్వారా తమ అభిప్రాయాలు, సమస్యలు, అభివృద్ధి ఆకాంక్షలను నాయకుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభించిందని పలువురు పాల్గొన్నవారు పేర్కొన్నారు.

ఎన్నికల విధులకు మాజీ సైనికులు సిద్ధం కావాలి

రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు పిలుపు

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు మాజీ సైనికులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు పిలుపునిచ్చారు. పోలీసు ఉన్నతాధికారుల అభ్యర్థన మేరకు ఎన్నికల విధుల్లో మాజీ సైనికుల సేవలు అవసరమని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా,

విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖతో కలిసి విధులు నిర్వహించడానికి వీలైనంత ఎక్కువ మంది మాజీ సైనికులు ముందుకు రావాలని కోరారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి ప్రభుత్వం నిర్ణయించిన పారితోషికం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మాజీ సైనికులు తమ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌తో సమీప పోలీస్ స్టేషన్, జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం లేదా తమ సంఘాల ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. మాజీ సైనికులను ఎన్నికల విధులకు సమీకరించడంలో జిల్లా స్థాయి సంఘాల నాయకులు చొరవ తీసుకోవాలని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

రాచూరులో టీడీపీ ప్రచారం

వేమూరు రక్షణ న్యూస్

వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలం రాచూరు గ్రామంలో పల్లెకోన ఎంపీటీసీ అభ్యర్థి రఘు బాబు, భట్టిప్రోలు జడ్పీటీసీ అభ్యర్థి నక్కా శ్రీనివాసరావు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకుంటూ, తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పల్లెకోన, రాచూరు గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అభ్యర్థులకు మద్దతుగా వారు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారూ.

వైసీపీ ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ రక్షణ న్యూస్

వినుకొండ పట్టణంలోని 11, 12, 13వ వార్డుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. ఈ ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక ప్రజలు, మహిళలు స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయా వార్డుల్లో పర్యటించిన బొల్లా బ్రహ్మనాయుడు పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, వారి ఆశీస్సులతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. వినుకొండ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పఠాన్ సాలేహ ఖాన్ (పీ.ఎస్. ఖాన్)తో పాటు 36 వార్డుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని బొల్లా బ్రహ్మనాయుడు ఓటర్లను కోరారు.

పర్చూరులో టీడీపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

పర్చూరు రక్షణ న్యూస్

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో భాగంగా పర్చూరు జడ్పీటీసీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి షేక్ మీరాభి, షంషుద్దీన్‌లు అద్దంకి నాంచారమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్చూరు మండలంలోని 1వ ఎంపీటీసీ అభ్యర్థి షేక్ ఖాజావలి, 3వ ఎంపీటీసీ అభ్యర్థి డి. రమేష్‌తో పాటు కూటమి నాయకులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అభ్యర్థులు, నాయకులు కలిసి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు.

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/25/2026 10:33 PM Page 5

ఎన్నికలపై పార్టీ నాయకులతో ఏలూరి సమీక్ష

పర్చూరు రక్షణ న్యూస్

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని స్థానిక ముఖ్య నేతలతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారంలో ప్రజలకు వివరించాల్సిన అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.గత రెండు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంతో పాటు, గతంలో ఇచ్చిన హామీల అమలు, రాబోయే రోజుల్లో గ్రామస్థాయిలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకుని వారికి భరోసా కల్పించేలా ప్రచారం సాగించాలని పేర్కొన్నారు .ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు చేరువ కావాలని, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ప్రచారం నిర్వహించాలని ముఖ్య నేతలకు పిలుపునిచ్చారు.

ఎన్నికల కోడ్ ముగిసే వరకు పీజీఆర్ఎస్ రద్దు

గుంటూరు, రక్షణ న్యూస్:

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నమై ఉండటం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి పూర్తయ్యే వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించబోమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య

చీరాల, రక్షణ న్యూస్:

చీరాల పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య కోరారు. చీరాల మున్సిపాలిటీ పరిధిలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 33వ వార్డు అభ్యర్థి మువ్వల శ్రీనివాసరావు, 22వ వార్డు అభ్యర్థి చెవిటి బాలసుబ్రమణ్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి హానీ స్పందనకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ఇదే అభివృద్ధి స్థానిక స్థాయిలో ప్రతి వార్డుకు చేరాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్యం, ఇతర పౌర సేవల మెరుగుదలకు స్థానిక సంస్థల పాత్ర కీలకమని అన్నారు. ప్రజలు తమ ప్రాంతాల అవసరాలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేసే ప్రతినిధులను ఎన్నుకోవాలని సూచించారు. "చెప్పాం.. చేస్తున్నాం" అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ప్రజల ముందుకు వెళ్తోందని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యక ర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల్లో ప్రజాప్రతి నిధుల భాగస్వామ్యం ద్వా రా ప్రభుత్వ కార్యక్రమా లు మరింత సమర్థంగా ప్రజలకు చేరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ, చీరాల పట్టణాన్ని అభివృద్ధి చెందిన, ప్రశాంతమైన, సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య నాయకత్వంలో మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ పదవితో పాటు కౌన్సిలర్ స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారనే ధీమాను వ్యక్తం చేశారు. అయితే ఎన్నికల ఫలితాలు ప్రజల నిర్ణయంపై ఆధారపడి ఉంటాయని, ప్రతి అభ్యర్థి ప్రజల విశ్వాసాన్ని పొందేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.ప్రచార కార్యక్రమంలో చీరాల అబ్జర్వర్, చిలకలూరిపేట ఏఎంసీ చైర్మన్ షేక్ కరీముల్లా, చీరాల యువ నాయకుడు మద్దులూరి గౌరీ అమర్నాథ్, స్థానిక ప్రముఖులు, కూటమి పార్టీల నాయకులు, మిత్రపక్షాల నేతలు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ ప్రచారంలో పాల్గొనడంతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది. స్థానిక సమస్యలు, పట్టణ అభివృద్ధి అంశాలను ప్రజల ముందుంచుతూ కూటమి అభ్యర్థులు ప్రచారాన్ని కొనసాగించారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ వేగంగా పూర్తి చేయాలి

596 పోలింగ్ కేంద్రాల పరిధిలో

గుంటూరు, రక్షణ న్యూస్:

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నవంబరు 1న జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పుల పంపిణీని నిర్ణీత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. ఆదివారం వార్డుల వారీగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టారు.నగరంలోని 596 పోలింగ్ కేంద్రాల పరిధిలో స్లిప్పుల పంపిణీ కోసం 596 మంది సిబ్బందిని నియమించినట్లు కమిషనర్ తెలిపారు. ఒక్కొక్కరికి సుమారు 1,000 నుంచి 1,200 స్లిప్పులు కేటాయించామన్నారు. ప్రతి ఓటరుకు స్లిప్పు అందేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని, పంపిణీలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ప్రక్రియను వార్డుల వారీగా ప్రత్యేక అధికారులు, బీఎల్ఓ సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు.ఓటరు స్లిప్పు అందించిన అనంతరం రశీదుపై ఆ కుటుంబంలోని ఒకరి సంతకం లేదా వేలి ముద్ర తీసుకోవాలని ఆదేశించారు. మరణించినవారు, నివాసం మారినవారు, అందుబాటులో లేని వారి వివరాలను సక్రమంగా నమోదు చేసి సంబంధిత జాబితాను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు.ఓటర్లు తమ వార్డు, పోలింగ్ కేంద్రం, ఓటరు జాబితా వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ https://sec-ems.ap.gov. in ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు.

పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఓటు హక్కు కలిగి, స్థానిక సంస్థల ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఈ నెల 27, 28 తేదీల్లో ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాలు పనిచేస్తాయని, ఓటింగ్ సౌకర్యార్థం 26 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓటర్లు తమ ఓటరు గుర్తింపు కార్డు లేదా తగిన ఫొటో గుర్తింపు కార్డు, ఎన్నికల విధుల కేటాయింపు ఉత్తర్వులతో హాజరుకావాలని సూచించారు. ఓటింగ్ గోప్యత కోసం ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేశామని, ప్రక్రియను వీడియోగ్రఫీ చేస్తామని తెలిపారు. ఓటర్లకు సహాయం చేసేందుకు హెల్ప్‌డెస్క్, ధ్రువీకరణ కోసం సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న అర్హులైన సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారంలోకి రాగానే టీడీపీ మున్సిపల్ అభ్యర్థులతో రాజీనామా చేయిస్తాం!

విడదల రజనీపై దాడిని ఖండించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు.. జ్యుడీషియల్ విచారణకు డిమాండ్

రక్షణ న్యూస్: చిలకలూరిపేట

మాజీ మంత్రి విడదల రజనీపై జరిగిన ఘటనను వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు తీవ్రంగా ఖండించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి ఆదివారం చిలకలూరిపేటలో రజనీని పరామర్శించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ నాయకులు, స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులపై దాడులు, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.టీడీపీ నేతలు గంజాయి బ్యాచ్‌ను రంగంలోకి దించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వైసీపీ నాయకులు ఆరోపించారు. ఎంపీటీసీ అభ్యర్థులను బ్లేడ్లతో గొంతు కోస్తామని బెదిరిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. మాజీ మంత్రి విడదల రజనీపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఎస్ఐ దాడి సమయంలో ఆమెకు గ్రానైట్ రాయి తగిలి ఏదైనా జరిగి ఉంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రజనీని హత్య చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని

వారు ఆరోపించారు.రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. పల్నాడు జిల్లాలో వైసీపీ అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేస్తూ, వారిపై గంజాయి కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. దాడులకు పాల్పడిన వారు టీడీపీకి చెందినవారా? లేక బిహార్ నుంచి వచ్చినవారా? అన్న అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని వ్యాఖ్యానించారు.వైసీపీ నాయకులు, కార్యకర్తలను వేధించిన వారిని తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వదిలిపెట్టబోమని మాజీ ఎమ్మెల్యేలు హెచ్చరించారు. ఈ ఘటనలపై జ్యుడీషియల్ విచారణ జరిపించి, దాడులకు పాల్పడిన వారిని, వారి వెనుక ఉన్నవారిని బయటకు తీసుకొస్తామని చెప్పారు.మరో రెండేళ్లలో ప్రజల ఆమోదంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వారు ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజే ప్రస్తుతం టీడీపీ తరఫున ఎన్నికయ్యే మున్సిపల్ ప్రజాప్రతినిధులతో రాజీనామాలు చేయించి, వైసీపీ అభ్యర్థులను బరిలో నిలుపుతామని వ్యాఖ్యానించారు.